సుందరీకరణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీ, అధికారులు

చిక్కడపల్లి: జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ సుందరీకరణ పనులను గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ నిధులు రూ.26 లక్షలతో పనులు చేపట్టామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, జవహర్‌నగర్ వ్యాయామశాల ఆటస్థలం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు నర్మెట్ట మల్లేశ్, గుండు జగదీశ్, జి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హరనాథ ప్రభు ఆవిర్భావ వేడుకలు



నల్లకుంట: కుసుమహర ఫౌండేషన్ మాణిక రావు దంపతుల ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్‌లో గల శ్రీకుసుమ హరనాథ ఆశ్రమంలో హరనాథ ప్రభువు 160వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రాధాకృష్ణులకు, కుసుమహరనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో నిర్వహించిన భజన ఆకట్టుకున్నది. అలాగే హరనాథ మహాప్రభు కేలండర్‌ను ఆవిష్కరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎంసీఏలో మ్యూజిక్ శిక్షణ

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని వైఎంసీఏ సెంటర్‌లో మ్యూజిక్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వైఎంసీఏ జనరల్ సెక్రెటరీ ప్రిస్టీ గైస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం మ్యూజిక్‌లో కీ బోర్డు, గిటార్‌లో శిక్షణ ఉంటుందని వివరాలకుకు 040- 27564670, 7093141120 సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-1 ఉద్యోగికి సన్మానం



చంద్రకిరణ్‌ను సత్కరిస్తున్న జయప్రకాశ్ రామ్, మల్లికార్జున్

కాచిగూడ: గ్రూప్–1లో ర్యాంకు సాధించి వికారాబాద్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన పెండ్యాల చంద్రకిరణ్‌ను కాచిగూడ వైశ్యహాస్టల్‌లో హాస్టల్ ట్రస్ట్‌బోర్డు ప్రతినిధులు శనివారం ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కొండ్లే మల్లికార్జున్, కొత్తూరు జయప్రకాశ్ రామ్, వెంపటి మధు, ఉప్పల రాజేశ్వర్, భాస్కర్ గుప్తా, దయాకర్ పాల్గొన్నారు.

శ్రీకాంత్ అయ్యంగార్‌పై చర్యలు తీసుకోవాలి



చిక్కడపల్లి: మహాత్మాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీకాంత్ అయ్యంగార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ యూఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సప్తగిరి థియేటర్‌లో శ్రీకాంత్ అయ్యంగార్ నటించిన చిత్రం అరి సినిమా ప్రదర్శన జరుగుతోంది. శనివారం ఎస్ఎస్‌యూఐ నేతలు సప్తగిరి థియేటర్ వద్ద సినిమా పోస్టర్లను చింపివేయడంతో పాటు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.

గెలుపు కోసం సహకరించండి



నల్లకుంట: జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ ఖైరతాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ డాక్టర్ రోహిణ్ రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా జూబ్లీహిల్స్ టికెట్ ఆశించిన వారిలో రోహిణ్ రెడ్డి ఉండడంతో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. తన గెలుపునకు సహకరించాలని నవీన్‌యాదవ్ రోహిణ్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్ రెడ్డి, మోత రోహిత్, దేవిరెడ్డి విజితా రెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, కాలేరు శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద.. 144 సెక్షన్

- 200 మీటర్ల వరకే ఊరేగింపులకు అనుమతి
- నామినేషన్ కేంద్రంతో పాటు 18 పికెటింగ్‌లు

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి



నామినేషన్ కేంద్రం ఇదీ బందోబస్తు..

డీసీపీ: చింతమనేని శ్రీనివాస్
అదనపు డీసీపీ: గోవర్ధన్
ఇద్దరు ఏసీపీలు: వెంకట్‌రెడ్డి, మురళీకృష్ణ
ఇన్‌స్పెక్టర్లు ఐదుగురు
ఎస్ఐలు 9 మంది
హెడ్‌కానిస్టేబుళ్లు, ఉమెన్ పీసీలు, ఉమెన్ హోంగార్డులు: 54 మంది
ప్లాటూన్లు: 2
గార్డ్ 1 ప్లస్ 4
పికెటింగ్‌లు 18

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ కేంద్రాన్ని బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు సంబంధిత సిబ్బంది ఇక్కడి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు(ఈ నెల 19, 20 సెలవు దినాలు) నామినేషన్లు వేయనున్నారు. నామినేషన్ల స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ తదితర ప్రక్రియలు కూడా వెంటనే జరగనున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చేనెల 11న జరగనుండగా 14న ఫలితాలు వెలువడనున్నాయి. ఉప ఎన్నిక సందర్భంగా మొత్తం 139 లొకేషన్లలో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉండగా ఇందులో 2,07,367 మంది పురుషులు కాగా, 1,91,590 మంది మహిళలు ఉన్నారు. నామినేషన్ సందర్భంగా షేక్‌పేట మండల కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

- నామినేషన్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర, సెక్టార్ ఎస్ఐ విజయ్‌తో కలిసి ఆయన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడ పోలీసులు బందోబస్తులో ఉండాలి, ఎక్కడెక్కడ పికెటింగ్‌లు ఏర్పాటు చేయాలి. 100 మీటర్ల పరిధి వద్ద పోలీసు గార్డు, 200 మీటర్ల వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయనున్నారు.
- నామినేషన్ కేంద్రంతో పాటు చుట్టూ 18 చోట్ల పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ర్యాలీలు, ఊరేగింపులకు నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల వరకే అనుమతి ఉంటుంది. కేంద్రానికి 100 మీటర్ల వరకు మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు. అలాగే 100 మీటర్ల నుంచి అభ్యర్థితో కలిపి ఐదుగురు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి నడుచుకుంటూ వెళ్లాలి. ఈ మొత్తం ప్రక్రియను ఇటు పోలీసులతో పాటు అటు ఎన్నికల సిబ్బంది కూడా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పకడ్బందీగా పర్యవేక్షిస్తారు. ప్రతి దృశ్యాన్నీ వీడియోలో నమోదు చేస్తారు.
- నినాదాలు ఇచ్చినా, పార్టీ జెండాలతో ర్యాలీగా వచ్చినా, పోలీసులతో పాటు ఎన్నికల సిబ్బంది విధులను అడ్డుకున్నా ఇదంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుందని పోలీసులు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు వేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అనుమానితుల కదలికలపై నిఘా పెడుతూ చుట్టూ పోలీసులను మోహరిస్తున్నారు.

'అగ్ర కులాలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సుదమల్ల వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఓటు ద్వారానే అగ్రకులాల వారికి బుద్ధి చెప్పాలని తెలంగాణ డెమోక్రటిక్ ఫంట్ కన్వీనర్, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సుదమల్ల వెంకటస్వామి పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిని గుర్తించి 250 గజాల ఇంటి స్థలంతో పాటు పెన్షన్, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధాన పార్టీలన్నీ డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. రిజర్వేషన్ల సాధనకు ఐక్య ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ విషయంపై బీసీ మంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు. బహుజనులంతా ఐక్యమైనప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బొంద్రమోని పురుషోత్తం, తెలంగాణ బహుజన ముక్తి పార్టీ అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రఫుల్ రామిరెడ్డి, రవిప్రసాద్, ముద్రబోయిన నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడిన జయప్రకాశ్ నారాయణ



జయప్రకాశ్ నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోవర్ధన్ రెడ్డి

కవాడిగూడ: ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి జయప్రకాశ్ నారాయణ అని తెలంగాణ అడ్వొకేట్స్ జేఏసీ చైర్మన్ పులిగారి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని జయప్రకాశ్ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించి సామాన్య పౌరుల హక్కులను హరించి, వాక్ స్వాతంత్రం పత్రికా సూచనల కాల రాసి ప్రతిపక్ష పార్టీల నేతలను రాత్రికి రాత్రే జైల్లో నిర్బంధించారన్నారు. ఆ సమయంలో జయప్రకాశ్ నారాయణ దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసి జనతా పార్టీని స్థాపించి 1977లో జరిగిన ఎన్నికల్లో ఇందిరా గాంధీని ఓడించారని గుర్తు చేశారు.

గొప్ప రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్



కొంపెల్లి వెంకట్ గౌడ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఉద్యమకారుడు కొంపెల్లి వెంకట్‌గౌడ్ గొప్ప రచయిత అని పలువురు వక్తలు కొనియాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వెంకట్ గౌడ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో శనివారం కొంపెల్లి వెంకట గౌడ్ సంతాప సభ జరిగింది. జై గౌడ జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, విషారాదన్ మహరాజ్, బాలగొని బాలరాజ్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్, యెలికట్టే విజయ కుమార్ గౌడ్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దళిత బహుజనుల సమస్యలను తన రచనల ద్వారా వెలుగులోకి తెచ్చిన రచయిత అన్నారు. ఆయన ఆశయాలను సాధించేందుకు కొంపెల్లి వెంకట్ గౌడ్ పేరిట విజ్ఞాన నిధిని ఏర్పాటు చేసి ఆయన రచనలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రాబోయే బుక్ ఫెస్టివల్ ప్రాంగణానికి ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో సత్యం గౌడ్, గడ్డమీది విజయ కుమార్ గౌడ్, నగేశ్ గౌడ్, వేములయ్య గౌడ్, శారద గౌడ్, డాక్టర్ అంబటి సురేంద్ర రాజు, దాసోజు లలిత పాల్గొని ప్రసంగించారు.

బస్సు చార్జీలు వెంటనే తగ్గించాలి



కవాడిగూడ: పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నేతలు జిల్లోజు హేమ సుదర్శన్, రమ్య గౌడ్, జి.సునీత తదితరులు బస్ భవన్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లోజు హేమ సుదర్శన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి పురుష ప్రయాణికుల దగ్గర రెట్టింపు చార్జీలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. అనంతరం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈవీ ముని శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆప్ నేతలు ఎండీ ఫైసల్ అజీమ్ బేగ్, ఎహసాన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల బరిలో ఉంటాం



వనం సుధాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ భాగస్వామ్య పార్టీ ఎంసీపీఐ (యూ) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్య ప్రకాశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వనం సుధాకర్ బరిలో ఉంటారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజలు విద్యావంతులు,మేధావులు, యువకులు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



అమన్ (ఫైల్)

కాచిగూడ: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి చెందిన ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమన్ (21) హాస్టల్లో ఉంటూ శివం రోడ్డులోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో వెల్డింగ్ శిక్షణ తీసుకుంటున్నాడు. శనివారం అతని రూమ్ తలుపుతట్టగా స్పందన లేకపోవడంతో బలవంతంగా తెరిచారు. అప్పటికే బెడ్‌పై మృతి చెంది ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కవాడిగూడ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమలగూడ హనుమాన్ ఆలయం వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు ఇచ్చిన సమాచారం ఇచ్చారు. ఈమేరకు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న 'సంఘం-శరణం గచ్ఛామి' నాటకం



అంబేద్కర్, గాంధీజీ, నెహ్రూల వేషధారణలు



నాటకాన్ని ప్రదర్శిస్తున్న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు

చిక్కడపల్లి: పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవేంద్ర రచించిన జగ్గరాజు దర్శకత్వం వహించిన సంఘం-శరణం గచ్ఛామి' నాటకాన్ని త్యాగరాయ గానసభలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు శనివారం ప్రదర్శించారు. అంబేడ్కర్ నిమ్న వర్గాల ప్రతినిధిగా, రాజ్యాంగ రచయితగానే ప్రాచుర్యంలో ఉన్నా ఆయన ఆలోచనలను నాటకంలో ఆవిష్కరించారు. జగ్గరాజు అంబేడ్కర్‌గా, ఇతర నటీనటులు పాత్రోచితంగా నటించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి కేకేరాజా హాజరై మాట్లాడుతూ.. మంచి నాటకాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు సివిల్ సర్వీసెస్ ఉన్నతాధికారి జేడీ శీలం, విశ్రాంత ఉన్నతాధికారులు మహీంద్ర, ఆర్. సుబ్బారావు, పీఎస్ఎన్ మూర్తి, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిజాం వారసత్వాన్ని కాపాడాలి

పంజగుట్ట: ప్రజల కోసం తమ పూర్వీకులైన నిజాంలు విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను నిర్మించారని, 1965 యుద్ధం సమయంలో భారత రక్షణకు 425 కిలోల బంగారం దానం చేశారని, వారి వారసత్వాన్ని కాపాడటం ఈ దేశం కర్తవ్యమని తొమ్మిదో నిజాం నవాబ్ రౌనక్ యార్ ఖాన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారి న్యాయసలహాదారు మొహమ్మద్ వేకార్ హుస్సేన్‌తో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. శేరిలింగంపల్లిలోని కంచ గచ్చిబౌలిలో సర్వే నంబర్ 25, 26లో 2,725 ఎకరాల భూమి ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్‌కు చెందినదన్నారు. సదరు భూమి నిజాం కుటుంబ చట్టబద్ధ యాజమాన్యాన్ని రక్షించాలని, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అనధికార ఆక్రమణను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసినట్లు వారు పేర్కొన్నారు. తాము కోర్టులో కేసు సంపద కోసమో హోదా కోసమో వేసింది కాదని, న్యాయం కోసం, చరిత్ర ప్రజలకు తెలియాలని, అభివృద్ధి పేరుతో చరిత్రను అంతం చేయకుండా కాపాడేందుకే అన్నారు. సమావేశంలో అసఫ్ జాహీ రాజవంశ వారసులు నవాబ్ మిర్ మిలాద్ అలీ ఖాన్, నవాబ్ మిర్ ఉస్మాన్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి పరిరక్షణలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ శాంతి పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత శాంతి నిరాయుధరణ, పర్యావరణ పరిరక్షణ సంస్థ, నవభారత నిర్మాణ సంస్థ సంయుక్తాధ్వర్యంలో 'హంతక రోబోలను నిషేధిద్దాం' అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైతే మానవ విలువలు ఉంటాయో అక్కడ ప్రపంచ శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ మేజర్ జనరల్ ఎస్. శ్రీనివాస్‌రావు, డాక్టర్ బాలకృష్ణ కురవే, సూరేపల్లి రవికుమార్, కె. శంకర్ రావు, పద్మిని సింగ్, అశోక్, రాజా, సునీల్, ఉపేంద్ర గుప్తా, అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'జెనిత్ ఫెస్ట్-2025'



నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో జాహ్నవి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఆధ్వర్యంలో 'జెనిత్ ఫెస్ట్–2025' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జాహ్నవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్‌పర్సన్ లక్ష్మి హాజరై మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. పలు పోటీలు నిర్వహించి విజేతలకు అవార్డులు, మెమొంటోలు అందజేశారు. – సాక్షి, సిటీబ్యూరో



'వచ్చే ఎన్నికల్లో బీజేపీదే గెలుపు'

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు ధీమా వ్యక్తం చేశారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం నుంచి నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వరకు నేతలతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా గౌతంరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అంబర్‌పేటలోని మహంకాళి అలయంలో నేతలతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్, ఎడెల్లి అజయ్ కుమార్, ఎ.సూర్యప్రకాశ్ సింగ్, చుక్కా జగన్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, బల్వీర్, సుభాష్ పటేల్, కృష్ణ కుమార్, శిర్‌సాగర్, హజారీ బాబు, అరవింద్, సంతోష్, సాయి, లావణ్య, వాసు, తారా, శాంతాబాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

ముషీరాబాద్: నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన గౌతంరావును బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొమ్యూరు శేషసాయి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

శుభాకాంక్షలు

నల్లకుంట: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతం రావును రాష్ట్ర కార్యాలయంలో నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



ర్యాలీగా వెళ్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు



ఎన్. గౌతంరావును సన్మానిస్తున్న శేషసాయి



గౌతంరావును సన్మానించిన వనం రమేశ్

ప్రీలాంచ్‌ల పేరుతో మోసాలు

తెలంగాణ కన్జ్యూమర్ నూతన కమిటీ

పంజగుట్ట: రాష్ట్రంలో వినియోగదారులు ఎన్నో విషయాల్లో మోసపోతున్నారని వారికి కనీసం ఎక్కడకు వెళ్లి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి ఉందని తెలంగాణ కన్జ్యూమర్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు ప్రసన్న కుమార్ రెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కన్జ్యూమర్ కమిటీ నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించి సభ్యులకు శనివారం నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్ రాజుతో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మోసాలు పెరిగిపోయాయని, ప్రీలాంచ్‌ల పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని వారికి కనీసం ఎక్కడ చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అలాంటి వారికి తాము సలహాలు అందజేస్తామన్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఆదిత్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వర్, విష్ణులకు నియామక పత్రాలు ఇచ్చారు.